# సమితుల ఏర్పాటుతో సాగుకు మంచిరోజులు

తునికి, కౌడిపల్లి: రైతు సమన్వయ కమిటీల ద్వారా వ్యవసాయానికి మంచి రోజులు రానున్నాయని జిల్లా వ్యవసాయాధికారి పరశురాం తెలిపారు. కౌడిపల్లి మండలం తునికి గ్రామ శివారులోని డాక్టర్ రామానాయుడు గ్రామీణాభివృద్ధి విద్యాసంస్థ ఆవరణలో సేంద్రియ సాగుపై చేపట్టిన రైతు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సమితిల ద్వారా పలు విధాలుగా మేలు చేకూరుతుందని, పంట ధర నిర్ణయం రైతుల చేతుల్లోనే ఉంటుందని తెలిపారు.

దళారుల నుంచి మోసపోకుండా ఉండేందుకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులకు సేంద్రియ సాగు గురించి శిక్షణ ఇస్తున్నామన్నారు. కనీసం మన కుటుంబ సభ్యుల కోసమైనా ఈ విధానంలో పండించాలని సూచించారు. విచ్చలవిడిగా పురుగు మందు, రసాయనాల వాడకంతో ఉత్పత్తులు కలుషితమవుతా యన్నారు. శిక్షణ ద్వారా కొంతమందైనా సేంద్రియం వైపు దృష్టి సారిస్తే ప్రయోజనం చేకూరుతుందన్నారు. విద్యాసంస్థ డైరెక్టర్ అర్జున్‌రావు మాట్లాడుతూ.. సాగును లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. కౌడిపల్లి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు ఆదిలక్ష్మి సేంద్రియ ఎరువుల తయారీని చూపించారు. వ్యవసాయాధికారులు రాజు, రాజ్‌నారాయణ, చైతన్య, సరిత, సాంకేతిక వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్ వెల్దుర్తి, చేగుంట, మనోహరాబాద్‌లకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# మల్లన్న ప్రసాదంలో నాణ్యత కొరవడిందని ఆందోళన

చేర్యాల : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో విక్రయించే స్వామివారి ప్రసాదంలో నాణ్యత కొరవడిందని సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు ప్రసాదం వాసన వస్తుందని చెప్పడంతో పార్టీ నాయకులు ఆలయానికి చేరుకొని ఆందోళనకు దిగారు. ప్రసాదాల తయారీ ప్రదేశాలను, విక్రయ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం బూజుపట్టిన లడ్డూ, వాసన వస్తున్న పులిహోరను చూపిస్తూ ప్రసాదాల తయారీ, విక్రయ బాధ్యుడైన బత్తిని పోచయ్యను నిలదీశారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పర్యవేక్షకుడు సుదర్శన్‌తో వాగ్వాదానికి దిగారు. లడ్డూ ప్రసాదంలో బొద్దింక పురుగుల అవశేషాలు వచ్చాయని, లడ్డూల తయారీ కేంద్రంలోని కడాయిలో పురుగులను చూపించారు. కడాయిలు కడకుండానే ప్రసాదాలు తయారు చేస్తున్నారని ఆరోపించారు.

ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకొని, నాణ్యత పాటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుల సత్తిరెడ్డి, రమణారెడ్డి, సనాధి భాస్కర్, తేలు ఇస్తారి తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై ఆలయ ఈవో రామకృష్ణారావును వివరణ కోరగా ప్రసాదాల తయారీలో కచ్చితమైన ప్రమాణాలు పాటిస్తామని, లడ్డూ, పులిహోర ఏరోజుకారోజే విక్రయిస్తామని చెప్పారు

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## తట్టు, రుబెల్లా నుంచి రక్షణకు టీకా



రామాయంపేట: తట్టు, రుబెల్లా ప్రాణాంతక వ్యాధులని, వాటి నుంచి రక్షణ కల్పించేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలకు టీకా వేయించాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు సూచించారు. రామాయంపేట వివేకానంద విద్యాలయంలో తట్టు, రుబెల్లా టీకా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 9 నెలల నుంచి 15 ఏళ్ల వయసు ఉన్న 2,00,969 మంది ఉండగా.. వారందరికీ టీకాలు వేయడం లక్ష్యమన్నారు. ఇప్పటికే 1,45,141 మందికి వేశామని చెప్పారు. బడి బయట పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణల్లో వేస్తామన్నారు. స్వైన్‌ఫ్లూ మురుగు గుంతల వల్ల రాదని, రోగనిరోధకశక్తి తగ్గడం వల్ల వస్తుందన్నారు. దీని నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని పేర్కొన్నారు. ఇప్పటికే ఆసుప్రతుల్లో 12 మంది స్టాఫ్‌నర్సులు, 8 మంది ల్యాబ్ టెక్నీషియన్స్, 4 పార్మాసిస్టుల పోస్టులు భర్తీ చేశామని, వైద్యులు రావాల్సి ఉందన్నారు. జిల్లాలోని 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 24 గంటలు పెంచేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని వివరించారు. డా.నవీన్, పీహెచ్‌ఎన్ సత్తమ్మ, సిబ్బంది వెంకటేశ్వర్ రావు, నిర్మల, బాబాలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్‌కుమార్, స్వప్న, రాంప్రసాద్, మధులత, శేఖర్ తదితరులు ఉన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మణుగూరు : ఈ నెల 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, ఖమ్మం సబ్ కోర్టు న్యాయమూర్తి వినోద్‌కుమార్ కోరారు. మణుగూరు కోర్టులో పోలీసు శాఖ, న్యాయమూర్తులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదు సంవత్సరాల క్రితం నుంచి పరిష్కారానికి నోచుకోని కేసులను ఈ ఏడాది డిసెండరు 31లోగా పరిష్కారమయ్యేందుకు కృషిచేయాలని వినోద్‌కుమార్ సూచించారు. కేసులు పరిష్కారమయ్యేందుకు పోలీసు శాఖ వారు సహకరించాలని కోరారు. మణుగూరు కోర్టు పరిధిలో లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు పరిష్కరించుకునేందుకు 563 కేసులు ఉన్నాయన్నారు. వీటిలో పోలీసులు నమోదు చేసినవి 353, చెల్లని చెక్కు కేసులు 96, గృహహింస 39, మనోవర్తి 75 కేసులు ఉన్నాయని ఆయన తెలిపారు. వీటన్నింటినీ లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం చేసుకోవాలని కక్షిదారులను ఆయన కోరారు.

సమావేశంలో మణుగూరు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శ్యాంసుందర్, ఏపీపీ దుర్గాబాయి, సీఐలు కె.మొగిలి, నరేందర్, ఎస్.ఐ. రాజ్‌కుమార్, న్యాయవాదులు విజయ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యలో విద్యార్థి అనుదీప్ ప్రతిభ

వైరా : వైద్య విద్యలో వైరాకు చెందిన విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచారు. వైరాకు చెందిన కాట్రేవుల వెంకట అనుదీప్ ప్రతిష్ఠాత్మక పాండిచ్చేరిలోని జిప్‌మర్ యూనివర్సిటీలో ఒకే ఒక్క గ్యాస్ట్రో ఎంటరాలజీ లివర్ విభాగం(డీఎం) సీటును సంపాదించారు. 2006లో ఎంసెట్‌లో 198 ర్యాంకు సాధించగా 2013లో వైద్యవిద్య పీజీ విభాగంలో అనుదీప్ జాతీయస్థాయిలో రెండోర్యాంకు సాధించారు. తాజాగా డీఎం విభాగంలో సీటు సాధించి ప్రతిభ చాటుకున్నాడు. తండ్రి వెంకటేశ్వర్లు విశ్రాంత ఉద్యోగి కాగా, తల్లి పద్మ వైరాలోని బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా ఉన్నారు.

## 108 వాహనంలో గర్భిణి ప్రసవం

తల్లాడ : నిండు గర్భిణి 108 వాహనంలో ప్రసవించిన సంఘటన శుక్రవారం తల్లాడలో చోటు చేసుకుంది. ఏన్కూరు మండలం మున్యాతండాకు చెందిన భూక్యా స్వాతికి పురిటినొప్పులు రావడంతో ఏన్కూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ప్రసవం కష్టంగా మారడంతో ఏన్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 108లో ఖమ్మం తరలిస్తుండగా మార్గం మధ్యలో తల్లాడ వద్ద వాహనంలో ప్రసవించింది. ఆమెకు మగబిడ్డ పుట్టాడు. అనంతరం తల్లీ, బిడ్డను తల్లాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించి మెరుగైన చికిత్స అందించారు. ప్రస్తుతం తల్లి స్వాతి, బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఏన్కూరు ఈఎంటీ కొత్తపల్లి సతీశ్, పైలెట్ బెజవాడ కృష్ణ వైద్య సేవలు అందించారు.

# బంగారు కవచాలంకృతంలో రామయ్య దర్శనం



భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధాన ఆలయంలో కొలువైన మూలమూర్తులు బంగారు కవచాలంకృతంలో దర్శనం ఇవ్వడంతో భక్తులు పరవశించిపోయారు. స్వర్ణాభరణాలతో సీతారాములవారు మరింత శోభాయమానంగా కనిపించి పరమానందభరితులను చేశారు. ఈ రూపంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు సుప్రభాతం పలికి ఆరాధన జరిపారు. క్షేత్ర విశిష్టత తన్మయత్వంలో నింపింది. భద్రాద్రి దర్శనం పరమ పావనమని వైదిక పెద్దలు చేసిన ప్రవచనం మంత్రముగ్ధులను చేసింది. విష్వక్సేనుల వారిని ఆరాధించి పుణ్యాహ వాచనం చేసి కంకణ ధారణ నిర్వహించి కన్యాదానం చేశారు.

సమస్త మంగళ వాయిద్యాలు మార్మోగుతుండగా సీతమ్మకు యోక్త్రధారణ చేసి రామయ్యకు యజ్ఞోపవీత ధారణ నిర్వహించారు. మాంగల్య ధారణ వేళ భక్తులు జైశ్రీరాం అంటూ నీరాజనాలు పలికి ఆధ్యాత్మికను చాటారు. తలంబ్రాల వేడుక కనులకు పండుగ చేయగా దర్బారు సేవలో స్వామి వైభవం సాక్షాత్కారమైంది. నేటి నుంచి ఈ నెల 5 వరకు ఆలయ వేళల్లో మార్పులు ఉంటాయని ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు తెలిపారు. ఉదయం 4 గంటలకు ఆలయం తలుపులు తెరచి రాత్రి 10.30 గంటల వరకు దర్శనాలు కల్పిస్తారు.

# లక్ష్యానికి ముందుగానే భగీరథ పనులు పూర్తి చేయాలి

## అధికారుల సమావేశంలో మంత్రి తుమ్మల



ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మిషన్ భగీరథ నిర్మాణ పనులు అక్టోబరు చివరి నాటికి పూర్తి చేసి నవంబరులో ప్రయోగాత్మక పరుగు(ట్రయల్ రన్) నిర్వహించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రెండు జిల్లాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ పనుల పురోగతిపై మంత్రి ఖమ్మంలోని టీటీడీసీ భవనంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సుమారు రూ.50వేల కోట్ల అంచనాలతో ప్రజాహితం కోసం చేపట్టిన మిషన్ భగీరథ ప్రపంచ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయాన్ని తెలంగాణ అధికారులు తమ శక్తిసామర్థ్యాలు నిరూపించుకునేలా ఒకే విడతలో పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఉభయ జిల్లాల్లో సుమారు రూ.3,558 కోట్లు మిషన్ భగీరథ పనులకు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. పాలేరు, వైరా, గోదావరి సెగ్మెంట్లలో ఇప్పటికే రూ.1,508 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. పాలేరు సెగ్మెంట్‌లో 20, వైరా సెగ్మెంట్‌లో 28, గోదావరి సెగ్మెంట్‌లో 99 నిర్మాణాలు చేపడుతున్నామని, ఇప్పటి వరకు 4412.75 కి.మీ. పైపులైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. పాలేరు సెగ్మెంట్‌లో 342, వైరా సెగ్మెంట్‌లో 462, గోదావరి సెగ్మెంట్‌లో 1,856 గ్రామాలకు ఇంటింటికి నల్లా ద్వారా తాగునీరు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా ఓహెచ్‌ఎస్‌ఆర్, ఇంట్రా విలేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. అటవీ, పర్యావరణ, రైల్వే, జాతీయ రహదారుల వంటి ఆటంకాలు తొలగించుకుని మిషన్ భగీరథ ముందుకెళుతోందని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలన్నారు. మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, పంజాబ్ రాష్ట్రాల ప్రతినిధులు ఇప్పటికే ఇక్కడి పనులు పరిశీలించి వెళ్లి వారివారి రాష్ట్రాల్లో అమలుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కూసుమంచి ప్రాంతంలో పూర్తయిన పనులకు ట్రయల్ రన్ నిర్వహించి ముందుగానే లోటుపాట్లు సరిచేయాలని సూచించారు.

కలెక్టర్ లోకేశ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ఇంటింటికి తాగునీరు అందిస్తామన్నారు. ఓహెచ్‌ఎస్‌ఆర్, ఇంట్రా విలేజ్ పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగిస్తామన్నారు. గ్రామస్థాయిలో నీటి సరఫరా, పంపిణీ పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ గోదావరి సెగ్మెంట్‌లో జరుగుతున్న పనులను వేగవంతం చేస్తామన్నారు. అక్టోబర్ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జడ్పీ అధ్యక్షురాలు గడిపల్లి కవిత, ఎమ్మెల్యేలు పువ్వాడ అజయ్‌కుమార్, బాణోత్ మదన్‌లాల్, తాటి వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, డీసీసీబీ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బుడన్‌బేగ్, మిషన్ భగీరథ సీఈ విజయ్‌పాల్‌రెడ్డి, ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈలు శ్యాంరావు, మాణిక్యరావు, రవీందర్, సదాశివ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికే సమన్వయ సమితులు



ఆదిలాబాద్ : రైతుల సంక్షేమానికే రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేస్తోందని మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ మండలం చాంద(టి) గ్రామంలో రైతు సమన్వయ సమితుల ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 15 మంది సభ్యులతో రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో 70 మంది రైతులు వ్యవసాయమే జీవన ఆధారంగా బతుకుతున్నారన్నారు. వ్యవసాయ సమగ్ర సర్వే ద్వారా ఒక్క చాంద(టి) గ్రామంలోనే 125 మంది రైతుల భూములకు సంబంధించి సమాచారం లభించని పరిస్థితి ఉందన్నారు. గతంలో భూరికార్డులు అస్తవ్యస్తంగా ఉన్నాయని అందువల్ల భూతగదాలు ఎక్కువగా పెరిగాయన్నారు.త్వరలో బినామీ పట్టాలను సరి చేయడానికి మీ గ్రామానికి అధికారులు వస్తారన్నారు. సమన్వయ సమితులను ఏర్పాటు చేసిన తర్వాత సభ్యులకు ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. అధికారులు నెల రోజుల పాటు గ్రామంలోనే ఉండి భూరికార్డులను సరిచేస్తారని, వీటి ద్వారా అర్హులైన రైతులకే ప్రభుత్వం ఎరువుల కోసం అందించే రూ.4 వేలు అందుతాయన్నారు. పాడి పంటలు పండాలంటే రైతులకు నిరంతరం విద్యుత్తు ఉండాలని భావించిన ప్రభుత్వం 24 గంటల విద్యుత్తు సరఫరాను అందిస్తుందన్నారు. మత్తడివాగు, పెన్‌గంగా ప్రాజెక్ట్ ద్వారా సాగు నీరు అందనుందన్నారు. గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకోలేకపోవడంతో వ్యవసాయం దండగ అనే పరిస్థితి ఏర్పడిందని, ఆ పరిస్థితిని తెరాస ప్రభుత్వం దూరం చేస్తుందన్నారు. గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం రాయితీ ద్వారా గొర్రెలను పంపిణీ చేస్తుందన్నారు. దళితుల అభివృద్ధికి మూడెకరాల భూమిని పంపిణీచేస్తున్నామని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం స్థిరనిధిని ఏర్పాటుచేయనుందన్నారు. ప్రతిమండలంలో ఒక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. గ్రామంలో విద్యుత్ ఉపకేంద్రం, గ్రంథాలయం, సీసీరోడ్లు, రెండు పడకగదులను మంజూరు చేయాలని మంత్రికి విన్నవించారు. త్వరలో అర్హులైన 50 మందికి రెండు పడక గదుల ఇళ్లను కట్టిస్తామని భరోసానిచ్చారు. విడతలవారీగా ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామినిచ్చారు. యాదవులకు గొర్రెలు పంపిణీ చేశారు. మంత్రికి గొర్రెను కానుకగా ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో డెయిరీ ఛైర్మన్ లోక భూమారెడ్డి, జేడీఏ ఆశాకుమారి, పశుసంవర్ధకశాఖాధికారి శంకర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆరె రాజన్న, జడ్పీటీసీసభ్యుడు అశోక్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, యూనిస్‌అక్బానీ, భోజారెడ్డి, ఆశమ్మ, నైతం శుక్లాలాల్, గంగారెడ్డి, రఘుపతి, ఆత్మఛైర్మన్ కొండ రమేష్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో రవీందర్, సర్పంచి అడెల్లు తదితరులు పాల్గొన్నారు.



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించాలి

## జిల్లా భూగర్భ, గనులశాఖ సహాయ సంచాలకుడు రవిశంకర్

తలమడుగు : సమస్త జీవరాశి మనుగడ వన సంపదపైనే ఆధారపడి ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని జిల్లా భూగర్భ, గనులశాఖ సహాయ సంచాలకుడు రవిశంకర్ అన్నారు. తలమడుగు మండలంలోని సుంకిడి శివారు ప్రాంతంలోని క్రషర్ల వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా 1500 మొక్కలను నాటారు. రవిశంకర్ మాట్లాడుతూ ఏటా తరిగిపోతున్న అటవీ సంపద వల్ల వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో కరవు కాటకాలు సంభవించడంతో పాటు మానవ స్థితిగతులు మారుతున్నాయని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యత సాధించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అంతర్రాష్ట్ర రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. నాటిన మొక్కలు సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌కుమార్, నవీన్, సుమన్, షఫీ, నర్సిం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వామికి స్వర్ణ పుష్పార్చన




యాదగిరిగుట్ట : ప్రతిష్ఠామూర్తులకు హారతి నివేదన.. ఉత్సవమూర్తులకు పాలాభిషేకం.. దర్శనమూర్తులకు స్వర్ణపుష్పార్చన.. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలతో యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహుడి సన్నిధి ప్రత్యేక పూజలతో కొనసాగింది. వేకువజామున సుప్రభాతంతో మేల్కొలిపిన స్వామి అమ్మవార్లను పూజారులు ఆరాధిస్తూ హారతితో కొలిచారు.

బాలాలయంలో ఉత్సవమూర్తులను పాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. కవచమూర్తులకు వేద మంత్ర పఠనాల మధ్య బంగారు పుష్పాలతో ఆరాధించారు. శ్రీ లక్ష్మీదేవిని ఆరాధిస్తూ కుంకు మతో అర్చన జరిపారు. మండపంలో యాజ్ఞికు లు పండితుల వేదమంత్ర పఠనాల మధ్య శ్రీ సుదర్శన నర సింహహోమం చేపట్టారు.

శ్రీ లక్ష్మీనరసింహుల నిత్యకల్యాణోత్సవాన్ని పాంచ రాత్ర ఆగమ శాస్త్రీయంగా నిర్వహించారు. కల్యా ణ మూర్తు లను గజవాహనంపై అధిష్టింప చేసి సేవోత్సవాన్ని చేపట్టారు. మహామండపంలో సహస్రనామాలతో ఆరాధిస్తూ అష్టోత్తరం జరిగింది.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## సాంకేతిక విద్యా శాఖ రాష్ట్ర సంచాలకులు రమణకుమార్

వెల్దండ : గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులు చదువుకోవడం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సాంకేతిక విద్యా శాఖ రాష్ట్ర సంచాలకులు రమణకుమార్ సూచించారు. శుక్రవారం వెల్దండలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయం, ఆదర్శ పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, కొట్ర ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ తరగతులను విద్యార్థులు వివియోగించుకొంటూ పరీక్షల్లో మాంచి మార్కులు సాధించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ప్రయోజకులై తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. అంతకుముంద ఆయా పాఠశాలలు, విద్యాయాల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. వెల్దండ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలను చేశారు. డిజిటల్ తరగతులు, మన టీవీ ద్వారా ప్రసారమవుతున్న పాఠ్యాంశాలు ఎలా ఉన్నాయి? ఏం బోధిస్తున్నారని ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయా తరగతుల విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారి ప్రతిభా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు సరఫరా చేసిన ఏకరూప దుస్తులు, పాఠశాలల్లోని వసతుల గురించి ఆరా తీశారు. ఆయనవెంట మండల విద్యాధికారి ఉన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

నేరడిగొండ: రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ అన్నారు. మండలంలోని కొర్టికల్ గ్రామంలో రైతు సమన్వయ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లా డుతూ రాష్ట్రప్రభుత్వం అభివృద్ధిలో దేశంలో ఎక్కడా లేని విధంగా దూసుకు పోతుంటే ప్రతిపక్షాలు నాయకులు మాత్రం ఏమీ చేయడం లేదనడం విడ్డూరమన్నారు. భూరికార్డుల్లో ఉన్న పొరపాట్లను సవరించడానికి రెవెన్యూ అధికారులు ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారని చెప్పారు. రైతుల అభివృద్ధి కోసం నూతనంగా రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భష్టాపూర్‌లో రూ.6.50లక్షల నిధులతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. మనం అభివృద్ధి సాదించాలంటే ప్రతిఒక్కరూ చదువుకున్నప్పుడే సాధ్యమవుతుం దన్నారు. తహసీల్దార్ కూనల గంగాధర్, ఎంపీడీఓ రియాజొద్దిన్, బోథ్ మార్కెట కమిటీ ఉపాధ్యక్షుడు దావుల బోజన్న, మండల తెరాస కన్వీనర్ కమల్‌సిం, ఉపాధ్యక్షుడు ఆత్రం లక్ష్మన్ కుమారి పీఏసీఎస్ ఛైర్మన్ శివారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

# సొసైటీలో అక్రమాలపై విచారణ చేపట్టాలి

భువనగిరి : రామన్నపేట మండలం సిరిపురం చేనేత సహకార సంఘలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సంఘం సభ్యులు చేనేత జౌళిశాఖ జిల్లా సహాయ సంచాలకురాలు పద్మకు వినతిపత్రం సమర్పించారు. సొసైటీ ఛైర్మన్ అప్పం రమేశ్వరం కొనుగోలు చేసిన బెడ్‌షీట్లపై అక్రమంగా 6 నుంచి 8 శాతం వరకు ధర తగ్గించి చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఒక్కో బెడ్‌షీట్ ధర రూ.500 కాగా వాటిపై రూ.30 నుంచి రూ.40 వరకు తగ్గించి సభ్యులకు చెల్లిస్తున్నారన్నారు. ఈ విధంగా గత నాలుగేళ్లుగా ఈ వ్యవహారం కొనసాగిస్తూ సుమారుగా రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు అక్రమంగా అర్జించారని ఆమె దృష్టికి తెచ్చారు. ఈ విషయమై తాము నిలదీస్తే సంఘం ఖర్చులు, అధికారుల ముడుపుల కోసం ఖర్చు చేస్తున్నామని చెప్పడమే కాకుండా సభ్యులను బెదిరిస్తున్నారని ఐదు నెలల క్రితం జరిగిన మహాసభలో ఈ విషయమై ఛైర్మన్ నిలదీయగా దాడికి ప్రయత్నించారని పేర్కొన్నారు. ఈ అక్రమాలపై చేనేతశాఖ మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేశామని విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అప్పం రాములు, రాపోలు పుండరీకం, సుధాకర్, అప్పం శ్రీరాములు ఉన్నారు.

# విద్యార్థి దశ నుంచే సేవా గుణాన్ని నేర్పించాలి

మోత్కూరు : విద్యార్థి దశ నుంచే సేవాగుణాన్ని నేర్పించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి-భువనగిరి జిల్లా ఛైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. మోత్కూరులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నూతనంగా ఎన్నికైన జిల్లా ఛైర్మన్, డైరెక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సేవాగుణం కలిగి ఉండటం వల్ల భవిష్యత్‌లో సమాజానికి సేవలందించే తత్వం కలిగి ఉంటారని పేర్కొన్నారు. కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లోనూ రెడ్‌క్రాస్ జూనియర్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ కమిటీలలో సభ్యులుగా చేరి సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఛైర్మన్, డైరెక్టర్లుగా ఎన్నికైన ఆ పాఠశాల ప్రిన్సిపల్ పి.మరియన్న విజయలను, ఎండీ. ఖలీల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రమేష్, సైదాచారి, సోమయ్య, మనోహర్, శ్రీనివాస్, మల్లిఖార్జున్, లక్ష్మి, జోసఫ్, విజయ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలకు ఎస్సీ స్టడీ సర్కిల్లో ఉచిత శిక్షణ

ఖమ్మం : బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ ఉద్యోగ పోటీపరీక్షలకు నగరంలోని ఎస్సీ స్టడీసర్కిల్లో ఆరు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ అభివృద్ధి అధికారి అచ్చుతానంద గుప్తా తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఈ నెల 8వతేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు టీఎస్ స్టడీసర్కిల్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తు దారులకు ఈనెల 17న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

### ప్రాజెక్టుల కింద నష్టపోయిన

# రైతులకు పరిహారం ఇవ్వాలి

## తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్వాల్‌రెడ్డి




పాలమూరు : జిల్లాలో నిర్మిస్తున్న వివిధ సాగునీటి ప్రాజెక్టుల కింద భూములు నష్ట పోతున్న రైతులకు తగిన నష్టపరిహారాన్ని అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్వాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాల యం వద్ద జిల్లా రైతు సంఘం ఏర్పాటు చేసిన డిమాండ్ డే కార్యక్రమంలో భాగంగా సంఘం జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రాజెక్టుల పేరుతో పేద, మధ్య తరగతి రైతులకు సంబంధించిన లక్షలాది ఎకరాల భూమిని ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటోందన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంభించడంతో వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో ఇరుక్కుం దన్నారు. దీనికి కారణం పాలకులు రైతుల కోసం ఎలాంటి సంక్షేమ పథకాలను అమలు చేయక పోవడ మేనని తెలిపారు. రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు అందించకపోవడం, పంటను నిల్వ చేసుకోవడానికి గిడ్డంగులు లేకపోవడం, మార్కెట్ ధరలపై అవగాహన కల్పించకపోవడంతో పంట దళారుల పాలవుతోం దన్నారు. పంటకు సరైన ధర రాకపోవడంతో అప్పులపాలై ఆత్యహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యలను పరిష్కరించాలని ఈనెల 1- 7 వరకు రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ డే పేరుతో రైతులకు మద్దతుగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు పరమేశ్‌గౌడ్, రామ్మోహన్, నాయకులు వాసుగౌడ్, రాజశేఖర్, వెంకట్రాములు, విల్సన్ పాల్గొన్నారు.

# స్వచ్ఛభారత్ మిషన్‌పై విస్తృతంగా ప్రచారం చేయండి

## రాష్ట్ర పథక సంచాలకుడు రాములు నాయక్



పాలమూరు : జిల్లాలో స్వచ్ఛభారత్ పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలని మిషన్ రాష్ట్ర పథక సంచాలకుడు రాములునాయక్ జిల్లా అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో దూరదృశ్య సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో విద్యార్థులు, యువతీయువకులకు అనేక రకాల పోటీలు పెట్టాలని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో 240 పదాల నిడివిగల వ్యాసాన్ని రాయాలన్నారు. అందుకు పరిశుభ్రత భారత్ కోసం నేను ఏమి చేయగలను అనే అంశంపై రాయాలన్నారు. భారత్‌ను పరిశుభ్రంగా ఉంచడంలో నా పాత్ర అనే అంశంపై సంక్షిప్త ఛాయాచిత్ర పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాసినవ్యాసాలను, చిత్రాలను జిల్లా స్వచ్ఛభారత్ మిషన్ మేనేజ్‌మెంట్ కమిటీ మహబూబ్‌నగర్ మెయిల్‌కు పంపాలన్నారు. అందుకు sbmg. mbnrg mail.com అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా నేరుగానైనా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని స్వచ్ఛభారత్ విభాగంలో సమర్పించాలన్నారు. జిల్లాలోని అధికారులు, అనధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొనాలన్నారు. ఈనెల 1- 8 వరకు వీటిని సమర్పించాలన్నారు. అనంతరం అందులో ఎంపికైన వాటికి బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్, ఉదిత్, పవన్‌కుమార్, వంశీ, మహేష్ పాల్గొన్నారు.

## వేతనాన్ని ఒకేసారి ఇవ్వాలి

కొల్లాపూర్ : విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు 2018 వేతన సవరణ సింగిల్ మాస్టర్ స్కేల్‌తో వేతనాన్ని ఒకే సారి ఇవ్వాలని రాష్ట్ర ఎలక్ట్రిసిట్ ఎంప్లాయిస్ యూనియన్- 327 సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు అన్నారు. పట్టణంలోని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరిని క్రమబద్ధీకరణ చేయాలన్నారు. 1999 తరువాత ఉద్యోగంలో చేరిన వారిని ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చి పించన్ సౌకర్యం కల్పించాలన్నారు. 2018 వేతన సవరణలో రిస్క్ అలవెలన్స్‌ను ఇప్పించాలని కోరారు.

# సర్కారు స్పందించకుంటే నిరవధిక సెలవులు

## టీఎస్‌సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ



మహబూబ్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాంట్రిబ్యూటరీ పింఛను పథకం రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయకుంటే నిరవధిక సెలవులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ తెలిపారు. జిల్లావ్యాప్తంగా శనివారం కాంట్రిబ్యూటరీ పింఛను వర్తింపజేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులు సామూహికంగా సెలవులు పెట్టి జిల్లా కేంద్రంలో టీఎస్‌సీపీఎస్ ఈఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మదీక్షలో పాల్గొన్నారు. మొదట ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం ర్యాలీగా తితిదే కల్యాణ మండపం వద్దనున్న ధర్నాచౌక్‌కు చేరుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ కలిగించేలా సీపీఎస్ విధానం ఉందన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న అందరికీ ఒకే రకమైన పింఛను విధానం ఉండాలన్నారు. ఉద్యోగుల కుటుంబాలకు భారోసా లేకుండా కొత్త విధానం ఉందన్నారు. అర్ధంతరంగా ఎవరైనా చనిపోతే ఆ కుటుంబలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకవు ఒక్క పిలుపిస్తే సామూహికంగా సెలవుపెట్టి ముందుకొచ్చారన్నారు.

సీపీఎస్ ఉద్యోగులు చేస్తున్న ధర్నాకు మద్దతు తెలిపేందుకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ వచ్చారు. ఆయన మాట్లాడుతున్న సమయంలో పలువురు ఉద్యోగులు అడ్డు తగలబోయారు. అసెంబ్లీలో సీపీఎస్ విధానం రద్దుకు తీర్మానం చేయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుకుంటే చేయవచ్చని, సీపీఎస్‌కు వ్యతిరేకంగా అందరూ ఎమ్మెల్యేలతో లేఖలు తీసుకోవాలని, ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి సమస్య వివరిద్దామన్నారు. అసెంబ్లీలో సైతం తీర్మానం చేయించుకునేందుకు కృషి చేస్తానన్నారు. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల పోరాటనికి అండగా ఉంటామని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, టీజీవో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రామకృష్ణాగౌడ్, రెవెన్యూ సంఘం అధ్యక్షుడు చెన్నకిష్టన్న, పీఆర్టీయూ అధ్యక్షుడు రఘురామ్‌రెడ్డి, తెలంగాణ పీఆర్టీయూ అధ్యక్షుడు శ్రీనివాసులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, సంఘం నాయకులు మురళీకృష్ణ, ఆడమ్స్, బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు, బహుజన ఉపాధ్యాయ సంఘం నాయకులు సుదర్శన్, బాలపీరు, టీఆర్టీయూ అధ్యక్షుడు నారాయణ అన్నారు.

సామూహిక సెలవులు పెట్టి పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు జిల్లా కేంద్రానికి తరలి వచ్చారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి ధర్నా చౌక్‌కు చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు రావడంతో పోలీసులు సైతం కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూశారు. ఉద్యోగులు సామూహికంగా సెలవులు పెట్టడంతో కార్యాలయాలు బోసిపోయి కనిపించాయి. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలస్వామి, రాజశేఖర్, అసొసియేట్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

# 19న రాష్ట్ర వ్యాప్త సమ్మె

## సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి

బీబీనగర్ : కార్మికులు సంక్షేమానికై ప్రభుత్వ జీవోలను సవరించాలని డిమాండ్‌చేస్తూ ఈ నెల 19న తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక రహదారి బంగ్లాలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాలపరిమితి దాటిన 71 షెడ్యుల్డ్ పరిశ్రమల, సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు అమలుచేయాలని, కార్మికులకు సానుకూలంగా జీవోలను సవరించాలని డిమాండ్‌చేస్తూ చేపట్టిన ఈ సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు కందాడి దేవేందర్‌రెడ్డి, నాయకులు గాడి శ్రీనివాస్, బస్వయ్య, రవీందర్, టంటం వెంకటేశం, దామోదర్‌రెడ్డి, సురేందర్, బాలయ్య, ప్రకాష్, మల్లేశ, హరికృష్ణ, లింగస్వామి, సందీప్‌రెడ్డి, చారి, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ కూలీల వేతనాలకు రూ.7కోట్లు విడుదల

## పది రోజుల్లో చెల్లించాలని కలెక్టర్ ఆదేశం

భువనగిరి : ఉపాధిహామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాల మంజూరైనందున పది రోజుల్లో వారి ఖాతాల్లో జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పాలనాధికారి అనితారామచంద్రన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ కూలీల వేతన బకాయిలు రూ.7 కోట్లు మంజూరైనందున వాటి పంపిణీపై బ్యాంకర్లు, పోస్టల్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధిహామీలకు బకాయిలన్నీ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. నగదు కొరత లేకుండా తపాలాశాఖలకు నగదు ఇవ్వాలని స్పష్టం చేశారు. రాబోయే పండగలను దృష్టిలో పెట్టుకుని ఉపాధికూలీలు ఇబ్బందులు పడకుండా వెంటనే వారి ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ కూలీల బ్యాంకు ఖాతాలను జాబ్‌కార్డులతో ఆధార్ అనుసంధానం చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలో 3,32,244 మంది ఉపాధిహామీ కూలీలు ఉండగా కేవలం 36వేల జాబ్‌కార్డులతో ఆధార్ అనుసంధానం పూర్తయినందున ప్రాధాన్యతనిచ్చి చేపట్టాలని కోరారు. ఆశించిన ప్రగతి మేరకు పంట రుణాల వితరణ జరగకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పంటరుణాలకు రైతులు ముందుకు రావడంలేదని చెప్పడం సరికాదన్నారు. పంటరుణాలు మంజూరుపై బ్యాంకు కంట్రోలింగ్ అధికారులు శాఖలవారీగా తరచూ సమీక్షలు జరిపి వేగవంతం చేయాలని సూచించారు. పందిరి కూరగాయాల సాగు, హరితగృహాలకు రుణాలు అందించడంలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. హరితహారంపై సమీక్షించిన కలెక్టర్ జిల్లాలో 1.30 కోట్ల మొక్కలు నాటాలన్నది లక్ష్యంకాగా ఇప్పటి వరకు వివిధ శాఖల ద్వారా సుమారు 67లక్షల మొక్కలు నాటించడం జరిగిందన్నారు. జిల్లాలోని 334 గ్రామపంచాయతీలలో 40వేల చొప్పున మొక్కలు నాటాలన్న లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. వచ్చే ఏడాది 1.5 కోట్ల మొక్కలు నాటేందుకు శాఖలవారీగా కార్యాచరణపై దృష్టి పెట్టాలన్నారు.

సమావేశంలో జేసీ రవి, శిక్షణలో ఉన్న అసిస్టెంట్ కలెక్టర్ ఆలె ప్రియాంక, డీఆర్‌డీవో వెంకట్రావు, జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి శ్రీనివాస్, బ్యాంక్ కంట్రోలింగ్ అధికారులు, జిల్లా అటవీశాఖ అధికారి డీవీ రెడ్డి, జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

